5 కోట్లు దాటిన ఐటీఆర్ ఫైలింగ్

న్యూఢిల్లీ, జూలై 27: దేశవ్యాప్తంగా ఆదాయ పన్ను చెల్లించేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ఇప్పటి వరకు 5 కోట్లకు పైగా ఐటీ రిటర్నులు దాఖలు చేశారని ఆదాయ పన్ను శాఖ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. గతేడాది దాఖలు చేసినవారికంటే ఇది 8 శాతం అధికం. ఈ శుక్రవారం ఒక్కరోజే 28 లక్షల మంది ఐటీఆర్ ఫైల్ చేశారు.

ఆభరణాల వ్యాపారంలోకి బిర్లా గ్రూపు

న్యూఢిల్లీ, జూలై 27:ఆభరణాల వ్యాపారంలోకి అడుగుపెట్టింది ఆదిత్యా బిర్లా గ్రూపు. దేశంలో వేగంగా విస్తరిస్తున్న ఆభరణాల మార్కెట్లోకి తాజాగా అడుగుపెట్టినట్లు, ఇండ్రియా బ్రాండ్‌తో రిటైల్ అవుట్‌లెట్లను ప్రారంభించినట్లు బిర్లా గ్రూపు చైర్మన్ కుమార మంగళం బిర్లా ఈ సందర్భంగా తెలిపారు. తొలి విడతలో ఢిల్లీ, ఇండోర్, జైపూర్‌లలో ఒకేసారి స్టోర్లను ప్రారంభించినట్లు, తర్వాతి క్రమంలో మెట్రో నగరాలకు విస్తరించనున్నట్లు ప్రకటించారు.

రెడ్డీస్ లాభం 1,392 కోట్లు

క్యూ1లో స్వల్పంగా తగ్గిన ప్రాఫిట్

ఆదాయంలో 14 శాతం వృద్ధి



హైదరాబాద్, జూలై 27: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరీస్ అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను రూ.1,392 కోట్ల కన్సాలిటేడెడ్ లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.1,403 కోట్ల లాభంతో పోలిస్తే ఒక్క శాతం తగ్గినట్లు పేర్కొంది. సమీక్షకాలంలో కంపెనీ రూ. 7,673 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.6,738 కోట్ల కంటే ఇది 14 శాతం అధికం.

ఉత్తర అమెరికా కీలకం

కంపెనీ అంచనాలకుమించి రాణించడానికి ప్రధాన కారణంగా ఉత్తర అమెరికా. ఇక్కడ సంస్థ వ్యాపారం ఏడాది ప్రాతిపదికన 20 శాతం ఎగబాకి రూ.3,850 కోట్లు లభించాయి. నూతన ఔషధాలను ఇక్కడి విడుదల చేయడం, జనరిక్ వ్యాపారం వృద్ధిని నమోదు చేసుకోవడం ఇందుకు కలిసొచ్చిందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. పలు ఉత్పత్తుల ధరలు తగ్గడంతో కొంతమేర ప్రభావాన్ని చూపాయి. అలాగే యూరప్ నుంచి రూ.530 కోట్లు సమకూరాయి. భారత్‌లో మందులను విక్రయించడంతో రూ.1,330 కోట్లు లభించాయి. ఏడాది క్రితంతో పోలిస్తే 15 శాతం వృద్ధిని కనబరిచింది. అలాగే అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి కంపెనీకి రూ.1,190 కోట్ల ఆదాయం సమకూరింది. అలాగే ఫార్మా స్యూటికల్స్ సర్వీసులు, యాక్టివ్ ఇంగ్రిడియంట్స్‌తో రూ.770 కోట్లు లభించాయి.

- అంతర్జాతీయంగా జనరిక్ ఔషధాల విక్రయాల్లో 15 శాతం వృద్ధి నమోదైంది. నూతనంగా పలు ఔషధాలు విడుదల చేయడం ఇందుకు కలిసొచ్చింది.
- కంపెనీకి వచ్చిన మొత్తం ఆదాయంలో రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కోసం 8.1 శాతం కేటాయించింది.
- అంతర్జాతీయంగా బయోసిమిలర్స్ తోపాటు జనరిక్ ఔషధాల అమ్మకాలుభారీగా పెరిగాయి.
- అమెరికాలో మూడు నూతన ప్రొడక్ట్‌లను విడుదల చేసిన సంస్థ.. యూరప్‌లో 12 ఔషధాలు అందుబాటులోకి తీసుకొచ్చింది.

నూతన ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికాన్ని లాభాలతో ప్రారంభించాం. జనరిక్ వ్యాపారం అంచనాలకు మించి రాణించడం వల్లనే ఇది సాధ్యమైంది. అనుబంధ వ్యాపారాలను మరింత బలోపేతం చేయడంతోపాటు బయోలాజిక్స్, కన్స్యూమర్ హెల్త్‌కేర్, ఇన్నోవేషన్ రంగాల్లో మరిన్ని పెట్టుబడులు పెట్టబోతున్నాం.

- జీవీ ప్రసాద్, రెడ్డీస్ కో-చైర్మన్, ఎండీ

20 నిమిషాలు వైఫై ఉచితం

అంతర్జాతీయ రూట్లలో విస్తారా ప్రత్యేక ఆఫర్

న్యూఢిల్లీ, జూలై 27:అంతర్జాతీయ ప్రయాణికులకు శుభవార్తను అందించింది విస్తారా ఎయిర్‌లైన్స్. టాటా-సింగపూర్ ఎయిర్‌లైన్స్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ విమానయాన సంస్థ.. అంతర్జాతీయ ప్రయాణికుల కోసం 20 నిమిషాలపాటు వై-ఫైను ఉచితంగా అందిస్తున్నట్లు ప్రకటించింది. ఆకాశంలో ప్రయాణించే సమయంలో ఇంటర్నెట్ సేవలు అందిస్తున్న తొలి దేశీయ విమానయాన సంస్థ విస్తారా కావడం విశేషం. ఆ తర్వాత కూడా ఈ ఇంటర్నెట్ సేవలు పొందాలంటే వీరి కోసం సరికొత్త ప్లాన్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. దేశీయ క్రెడిట్/డెబిట్ కార్డుల ద్వారా చెల్లించి ఈ ప్లాన్లను పొందవచ్చునని పేర్కొంది. ఈ సేవలు కేవలం బోయింగ్ 787-9 డ్రీమ్‌లైనర్, ఎయిర్‌బస్ ఏ321 నియో విమానాల్లో మాత్రమే లభించనున్నాయి. వై-ఫైకి సంబంధించిన వన్‌టైం పాస్‌వర్డ్ ఈ-మెయిల్ ద్వారా ప్రయాణికులకు చేరవేయనున్నట్లు, ఈ వై-ఫై సేవలు మరికొంత కాలం పొందాలంటే ప్లాన్లను కొనుగోలు చేయాల్సి ఉంటుందని తెలిపింది. విమాన ప్రయాణం మరింత సుఖవంతంగా ఉంచాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ చీఫ్ కమర్షియల్ అధికారి దీపక్ రజావత్ తెలిపారు.

- బిజినెస్ క్లాస్, ప్లాటినం క్లబ్ విస్తార సభ్యులకు మరో 50 ఎంబీ డాటాను ఉచితంగా అందిస్తున్నది.
- జీఎస్టీ కలుపుకొని రూ.372.74 చెల్లించిన మిగతా ప్రయాణికులకు అన్‌లిమిటెడ్‌గా వాట్సప్, ఫేస్ బుక్ సేవలు పొందవచ్చును.
- అలాగే జీఎస్టీ కలుపుకొని రూ.1,577 చెల్లించిన వారికి డాటా, ఆడియో, వీడియో స్ట్రీమింగ్‌ను సోషల్ మీడియా, వెబ్ ద్వారా పొందవచ్చును.
- జీఎస్టీ కలుపుకొని రూ. 2,707.05 ప్లాన్ కింద అన్‌లిమిటెడ్ డాటాను పొందవచ్చును.

ICICI Bank

అంచనాలుమించిన ఐసీఐసీఐ బ్యాంక్

క్యూ1లో రూ.11,059 కోట్ల లాభం

న్యూఢిల్లీ, జూలై 27: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన ఐసీఐసీఐ బ్యాంక్ ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.11,059 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని గడించింది. 2023-24 ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.9,648.2 కోట్ల లాభంతో పోలిస్తే 14.62 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.38,763 కోట్ల నుంచి రూ.45,998 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. నిర్వహణ ఖర్చులు రూ.24,624 కోట్ల నుంచి రూ.29,973 కోట్లకు పెరిగాయి.

- బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 2.36 శాతంగా(రూ.28,718.6 కోట్లు) నమోదయ్యాయి.
- నికర ఎన్‌పీఏ 0.42 శాతం(రూ.5,377.8 కోట్లు) నుంచి 0.43 శాతానికి(రూ.5,684.8 కోట్లు) పెరిగాయి.
- నికర వడ్డీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 7.3 శాతం ఎగబాకి రూ.19,552.9 కోట్లకు చేరుకున్నాయి.
- బ్యాంక్ డిపాజిట్లు గతేడాదితో పోలిస్తే 15 శాతం పెరిగి రూ.14.26 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. అడ్వాన్స్‌లు రూ.12.23 లక్షల కోట్లు.
- మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ రూ.1,332.18 కోట్ల నిధులను వెచ్చించింది. కిందేటాది కేటాయించిన దాంతో పోలిస్తే 85.4 శాతం పెరిగాయి.
- కొత్తగా రూ.5,916 కోట్ల రుణాలు మొండి బకాయిల జాబితాలోకి చేరాయి.

ఆవిష్కర్తలకు టీ వర్క్స్ దూరం

- నిధుల లేమితో ఇక్కట్లు.. సొంత నిధులే దిక్కు
- ఆశయాలకు గండికొడుతున్న కాంగ్రెస్ సర్కార్

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 27 (నమస్తే తెలంగాణ): సృజనాత్మక ఆలోచనలకు భౌతిక రూపమే టీ వర్క్. ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. గత కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన దేశంలోనే అతిపెద్ద ప్రోటోటైపింగ్ సెంటర్ ప్రస్తుతం ఆవిష్కర్తలకు దూరంగా నిలుస్తున్నది. రాయిదుర్గం నాలెడ్జ్ సిటీలో విశాలమైన ప్రాంగణంలో మొదటి దశలో 78 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో గత ప్రభుత్వం టీ వర్క్స్‌ను నిర్మించింది. ఒకప్పుడు వెలుగు వెలిగిన ఈ ఆవిష్కరణల సెంటర్ ప్రస్తుతం వెలవెలపోతున్నది. రాష్ట్ర ప్రభుత్వం మారగానే అంతా తారుమారైంది. ఆవిష్కరణలు చేసుకోవాలంటే ఒక్కొక్కరు ఏడాదికి రూ.35 వేలు చెల్లిస్తేనే స్టార్టప్ కార్యకలాపాలు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని టీ వర్క్స్ నిర్వాహకులు ఖరాఖండిగా చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించకపోవడంతో సొంతంగా ఆదాయ వనరుల మార్గాలను అన్వేషించుకోవాలని ప్రభుత్వ పెద్దలే చెప్పడంతో టీ వర్క్స్ పరిస్థితి మొత్తం మారిపోయింది. గతంలో ఇక్కడ పనిచేసిన వారంతా ఒక్కొక్కరుగా వెళ్లిపోతున్నారు.

ఆరు నెలల్లో అంతా తారుమారు..

సరికొత్త ఆవిష్కరణలతో ఎన్నో సమస్యలకు చక్కని పరిష్కారం చూపే ఔత్సాహికులు తెలంగాణ రాష్ట్రంలో వందలాది మంది ఉన్నారు. అలాంటి వారికి టీ వర్క్స్‌లో ప్రోత్సాహం కరువుకావడంతో వారి ఆందోళన చెందుతున్నారు. ఆరు నెలల్లోనే ఈ పరిస్థితి దాపురించిందని విమర్శిస్తున్నారు. టీ హబ్‌తో టెక్నాలజీ రంగంలో సరికొత్త ఆవిష్కరణలు చేస్తున్నట్లుగానే హార్డ్‌వేర్ రంగంలోనూ, ముఖ్యంగా సరికొత్త డిజైన్లతో భౌతిక ఉత్పత్తులను తయారు చేసే వారిని గుర్తించడంతో పాటు వారిని ప్రోత్సహించేందుకు టీ-వర్క్స్‌ను గత కేసీఆర్ ప్రభుత్వం వందలాది కోట్లను వెచ్చించి ఏర్పాటు చేసింది. ఇంత చేసి నా కాంగ్రెస్ సర్కార్ మాత్రం ఔత్సాహికులైన ఆవిష్కర్తలకు మాత్రం ఇక్కడ అడుగు పెట్టాలంటే డబ్బులు కట్టాల్సిందే అంటున్నాయి. దీనిపై ఆవిష్కరణలు తీవ్ర నిరుత్సాహానికి గురవుతున్నారు.

రష్యాలోని స్కోల్‌కోవో ఇన్నోవేషన్ సెంటర్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకుంటున్న టీ హబ్ ప్రతినిధులు

స్కోల్కోవో ఇన్నోవేషన్ సెంటర్‌తో

టీ హబ్ జట్టు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 27 (నమస్తే తెలంగాణ): టీ హబ్ కేంద్రంగా కార్యకలాపాలను నిర్వహిస్తున్న స్టార్టప్‌లకు రష్యాలో అవకాశాలను కల్పించేందుకు రష్యా ఇన్నోవేషన్ సెంటర్ స్కోల్కోవోతో టీ హబ్ వ్యూహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడానికి, వివిధ రంగాల్లో పరిశోధన సహకారాలను అందించేందుకు మాస్కో కేంద్రంగా పనిచేస్తున్న స్కోల్కోవో ఇన్నోవేషన్ సెంటర్‌తో కలిసి పనిచేయనున్నామని టీ హబ్ ప్రతినిధి తెలిపారు. రష్యాలో మన స్టార్టప్‌లు తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ఈ ఒప్పందం దోహదం చేయనున్నదన్నారు.

30న 'సీనియర్ నర్సింగ్'కు కౌన్సెలింగ్

- తాజా జాబితాపైనా ఆరోపణలు

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ): సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లకు ఈ నెల 30న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు వైద్యశాఖ తెలిపింది. మొత్తం 121 మందితో సీనియార్టీ జాబితా విడుదల చేసింది. వాస్తవానికి ఈ నెల 20న సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ల బదిలీలు జరగాల్సి ఉన్నది. సీనియార్టీ, ఖాళీల జాబితాలో తప్పులు దొర్లాయన్న ఆరోపణల నేపథ్యంలో కౌన్సెలింగ్ ఆగిపోయింది. దీంతో తాజాగా కొత్త జాబితా విడుదల చేశారు. దీనిపైన కూడా నర్సులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. పాత జాబితాలో బదిలీ అయ్యేవారి సంఖ్య 126 మందికాగా, కొత్త జాబితాలో ఐదుగురి పేర్లు తగ్గాయని అంటున్నారు. ఒకేచోట 30 ఏండ్లుగా పనిచేస్తున్న ఓ నర్సు పేరు కూడా మాయమైందని చెప్తున్నారు. ఇలా ఎందుకు జరిగిందో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

5 నుంచి జేఎల్ అభ్యర్థులకు వెరిఫికేషన్

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ): జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీకి 1:2, 1:5 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆగస్టు 5 నుంచి సెప్టెంబర్ 11 వరకు నిర్వహించనున్నట్టు టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నాంపల్లిలోని కమిషనర్ కార్యాలయంలో ఉదయం 10:30 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ మొదలవుతుందని పేర్కొన్నారు. వెబ్ ఆప్షన్లు ఆగస్టు 3 నుంచి సెప్టెంబర్ 13 వరకు ఇచ్చుకోవచ్చని తెలిపారు. జాబితాను కమిషన్ వెబ్‌సైట్‌లో పెట్టినట్టు వివరించారు.

గ్రూప్-4 దివ్యాంగులకు 30 నుంచి వైద్య పరీక్షలు

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ): సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన గ్రూప్-4 దివ్యాంగుల అభ్యర్థులకు ఈ నెల 30 నుంచి ఆగస్టు 5 వరకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్‌నికోలస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎర్రగడ్డలోని మెంటల్ కేర్ ప్రభుత్వ దవాఖానలో నిర్వహించే పరీక్షలు ఆటిజం, మానసిక రుగ్మత, మందబుద్ధి అభ్యర్థులు హాజరుకావాలని సూచించారు. షెడ్యూల్‌ను వెబ్‌సైట్‌లో ఉంచినట్టు పేర్కొన్నారు.

31న డీఏవో ప్రాథమిక 'కీ'

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ): డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ (వర్క్) గ్రేడ్-2 పరీక్షల ప్రాథమిక కీని https://www.tspsc.gov.inలో ఈ నెల 31న విడుదల చేయనున్నట్టు టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్‌నికోలస్ తెలిపారు. కీపై అభ్యంతరాలను ఆగస్టు 1 నుంచి 5 వరకు కమిషన్ వెబ్‌సైట్ లింక్ ద్వారా మాత్రమే స్వీకరించనున్నట్టు పేర్కొన్నారు.

వాయుకాలుష్యంతో మృత్యుగంటలు!

- ఏటా దేశంలో పెరుగుతున్న మరణాల సంఖ్య
- 10 నగరాల్లో 33 వేల మంది మృత్యువాత
- హైదరాబాద్‌లో ఏటా 1,597 మంది బలి
- లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ జర్నల్ నివేదిక వెల్లడి
- అంతర్జాతీయ వర్సిటీల శాస్త్రవేత్తల అధ్యయనం

హైదరాబాద్, జూలై 26 (నమస్తే తెలంగాణ): వాయు కాలుష్యం జీవకోటికి పెనుముప్పుగా పరిణమించింది. మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్నది. ఏటా వేలాది మంది మృత్యువాత పడుతున్నారు. ముఖ్యంగా నగరాల్లో ఈ మరణాల సంఖ్య తీవ్రస్థాయిలో పెరుగుతన్నది. లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ జర్నల్ మనదేశంలో కబళిస్తున్న వాయుకాలుష్యంపై ఇటీవల ప్రచురించిన కథనంలో ఆందోళనకర విషయాలను వెల్లడించింది. లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ జర్నల్ ఇటీవల 'భారతదేశంలోని 10 నగరాల్లో పరిసర వాయు కాలుష్యం, రోజువారీ మరణాలు'' అనే అంశంపై సంచలన కథనాన్ని ప్రచురించింది. అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, హైదరాబాద్, కోల్‌కతా, ముంబై, పుణె, సిమ్లా, వారణాసి నగరాల్లో ఆ సంస్థ అధ్యయనం నిర్వహించింది. ఆయా నగరాల్లో ఏటా దాదాపు 33 వేల మరణాలు వాయుకాలుష్యం కారణంగా సంభవించి ఉండొచ్చని లాన్సెట్ నివేదిక తెలిపింది. ఆ 10 నగరాల్లో నమోదైన మరణాల్లో 7.2 శాతం వాయు కాలుష్యం వల్లే అంటూ పరిశోధనలో తెలిపింది.

ప్రపంచవ్యాప్తంగా ఏటా 80 లక్షల మంది మరణం

ప్రపంచ వ్యాప్తంగా ఏటా 80 లక్షల మందికి పైగా వాయు కాలుష్యం కారణంగా మరణిస్తున్నారు. వీరిలో ఐదేండ్లలోపు చిన్నారులు 7 లక్షల మందికి పైగా ఉన్నారు. చిన్నారుల్లో పౌష్టికాహారలోపం తర్వాత ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మరణాలు వాయు కాలుష్యం కారణంగా సంభవిస్తున్నాయి. దేశంలో ప్రతి రోజూ 464 మంది ఐదేండ్లలోపు చిన్నారులు వాయు కాలుష్య కాటుకు బలవుతున్నారు. 2021లో దేశంలో 21 లక్షల మంది ఈ కారణంగా మృతిచెందినట్టు స్టేట్ ఆఫ్ గ్లోబల్ ఎయిర్ 2024 నివేదిక వెల్లడించింది. చైనాలో అత్యధికంగా 23 లక్షల మరణాలు నమోదవగా, భారత్‌లో ఆ తర్వాత మరణాలు నమోదయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న ప్రతి నాలుగు వాయు కాలుష్య మరణాల్లో ఒకటి భారత్‌లోనే సంభవిస్తున్నట్టు గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి. 2008-2019 మధ్య హైదరాబాద్ నగరంలో వాయుకాలుష్యం కారణంగా 5,552 మంది ప్రజలు మరణించినట్టు అశోకా యూనివర్సిటీ, సెంటర్ ఫర్ క్రానిక్ డిసీజ్ కంట్రోల్, కరోలిన్ స్కా ఇన్‌స్టిట్యూట్, హార్వర్డ్ యూనివర్శిటీ, బోస్టన్ యూనివర్శిటీ పరిశోధకులు తేల్చారు.

భారత్‌లో వాయు కాలుష్య మరణాలు (ఏటా)

ఢిల్లీ	11,964
ముంబయి	5,091
కోల్‌కతా	4,678
చెన్నై	2,870
అహ్మదాబాద్	2,495
బెంగళూరు	2,102
హైదరాబాద్	1,597
వారణాసి	831
పుణె	1,367
సిమ్లా	59

శ్వేతపత్రంతో చంద్రబాబు కొత్త డ్రామా

ఖైరతాబాద్, జూలై 27 : ఎన్నికల హామీల నుంచి తప్పించుకునేందుకు ఏపీ సీఎం చంద్రబాబునాయుడు శ్వేతపత్రం డ్రామా ఆడుతున్నారని ఏపీ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయంలో 40 ఏండ్ల చరిత్ర ఉందని చెప్పుకునే చంద్రబాబుకు ఆర్థిక సందప ఎలా సృష్టించాలో తెలియదా అని ప్రశ్నించారు. తాము ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజల అభిప్రాయాలు అడుగుతానని ప్రకటించడం హాస్యాస్పదమని హేళన చేశారు. గత ప్రభుత్వ హయాంలో అప్పులు పెరిగాయని చెబుతున్న ప్రస్తుత సంకీర్ణ ప్రభుత్వం జూన్ 20 నుంచి జూలై 16 వరకు రూ.9 వేల కోట్ల అప్పులు చేసిందని ఆరోపించారు.

కాంగ్రెస్‌కు మంత్రసానితనమూ రాదు

కాంగ్రెస్‌కు మంత్రసాని పని కూడా చేతకాలేదు. వాజపేయి హయాంలో మేము మూడు కాన్పులు (మూడు రాష్ట్రాల ఏర్పాటు) విజయవంతంగా చేశాం. పార్టీ ఫిరాయింపులకు వ్యక్తిగతంగా నేను వ్యతిరేకం. రాజకీయ వ్యభిచారులే పార్టీ మారుతారు. ఎమ్మెల్సీ కవిత కేసు విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుంది. నిజామాబాద్ ఆడబిడ్డ జైలు నుంచి బయటికి రావాలని కోరుకుంటున్నా. రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చి హోంమంత్రి కావడమే లక్ష్యం.

- బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

కాంగ్రెస్ హామీలకు 9 లక్షల కోట్లు కావాలి

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను విస్మరిస్తోంది. వరి ధాన్యానికి బోనస్ ఇస్తామని చెప్పి.. సన్నాలకు మాత్రమే అని ఎందుకు చెప్పలేదు? కౌలు రైతులకు రైతుభరోసా ఎప్పటి నుంచి ఇస్తారు ? మహిళలకు రూ. 2500 ఏమైంది ? కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటే ఏడాదికి రూ. 9 లక్షల కోట్ల బడ్జెట్ అవసరం. ఆదిలాబాద్‌లో ఎయిర్‌ఫోర్స్‌స్టేషన్ ఏర్పాటుకు, మూతపడ్డ సిమెంట్ ఫ్యాక్టరీని తెరిచేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వమే ముందుకు రావాలి.

- శాసనసభలో బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్

31 నుంచి ఎడ్‌సెట్, పీఈసెట్ కౌన్సెలింగ్

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ): టీజీ ఎడ్‌సెట్ ద్వారా బీఈడీ కాలేజీల్లో, పీఈసెట్ ద్వారా ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీల్లో ప్రవేశాలకు ఈ నెల 31 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం కానున్నది. టీజీ ఎడ్‌సెట్, టీజీ పీఈసెట్ అడ్మిషన్ల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను శనివారం హైదరాబాద్‌లో టీజీ సీహెచ్ఈ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి విడుదలచేశారు. ఎడ్‌సెట్‌కు ఆగస్టు 8 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. 22, 23న వెబ్ ఆప్షన్స్, 24న ఎడిట్ ఆప్షన్స్‌కు అవకాశం కల్పించారు. 30న ఫస్ట్‌ఫేజ్ సీట్ల కేటాయింపు జాబితా విడుదల చేయనున్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు 31 నుంచి సెప్టెంబర్ 4వరకు ఆయా కాలేజీల్లో రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. పీఈసెట్‌కు ఆగస్టు 7 నుంచి 14వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ఉంటుంది. 16, 17న వెబ్ ఆప్షన్స్, 18న ఎడిట్‌కు అవకాశం కల్పించారు. 20న ఫస్ట్‌ఫేజ్ సీట్ల కేటాయింపు జాబితా విడుదల చేస్తారు. సీట్లు పొందిన అభ్యర్థులు 21 నుంచి 24వరకు ఆయా కాలేజీల్లో రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. వివరాలకు http://edcetadm.tsche.ac.in, http://pecetadm.tsche.ac.in వెబ్‌సైట్లను చూడాలని సూచించారు.

అక్రమ కేసులు దుర్మార్గపు చర్య : ఎస్ఎఫ్ఐ

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి నిధుల తగ్గింపును నిరసిస్తూ ఆందోళన చేపట్టిన ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లా అధ్యక్షుడు సందీప్, కార్యదర్శి ధర్మభిక్షంపై అక్రమకేసులు బనాయించడం దుర్మార్గపు చర్య అని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి, రాష్ట్ర కార్యదర్శి టీ నాగరాజు అన్నారు. శనివారం హైదరాబాద్‌లో వారు మాట్లాడుతూ.. స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎస్ఐపై ఒత్తిడి పెంచి ఆందోళనకారులపై అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు.

స్టూడెంట్స్ కొట్లాట.. డిగ్రీ విద్యార్థి మృతి

పాల్వంచ రూరల్, జూలై 27: ఇంటర్, డిగ్రీ విద్యార్థుల కొట్లాటలో డిగ్రీ విద్యార్థి మృతిచెందాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం యానంబైలు ఎస్సీ కాలనీకి చెందిన అల్లూరి విష్ణు (21) లక్ష్మీదేవిపల్లి(ఎస్) డిగ్రీ కాలేజీలో సెకండియర్ చదువుతున్నాడు. ఇంటర్ చదివే విద్యార్థులకు, విష్ణుకు పాతకక్షలు ఉన్నాయి. పాల్వంచలోని ఆర్‌సీఎం చర్చి వద్ద శనివారం విష్ణు, ఇంటర్ విద్యార్థులకు ఘర్షణ జరిగింది. కాలేజీలో కూడా గొడవ జరగగా, బయటకు వచ్చి భద్రాచలం ప్రధాన రహదారి పక్కన దాగి ఉన్న కొందరు ఇంటర్ విద్యార్థులు విష్ణుపై దాడి చేయడంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. అదే సమయంలో ఆటోలో భద్రాచలం వెళ్తున్న విష్ణు బంధువులు చూసి పాల్వంచ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. విష్ణు అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

రైలు కింద పడి ఉద్యమనేత బలవన్మరణం

నల్లబెల్లి, జూలై 27: అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో వరంగల్ జిల్లా నల్లబెల్లికి చెందిన తెలంగాణ ఉద్యమ నేత బలవన్మరణానికి పాల్పడ్డాడు. శనివారం వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లబెల్లికి చెందిన వడ్లూరి సత్యం(48) తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. 2012 సెప్టెంబర్ 30న హుస్సేన్‌సాగర్ వద్ద చేపట్టిన సాగరహారంలో పాల్గొనగా, పోలీసుల చేతిలో లాఠీ దెబ్బలు తిని స్పృహ కోల్పోయాడు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి వైద్య సేవలందించడంలో సహకరించారు. సత్యం ఆరోగ్య రీత్యా కోలుకున్నా.. మతిస్థిమితం కోల్పోయాడు. విషయం తెలుసుకున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి, సత్యం భార్య రాణికి కస్తూర్బా పాఠశాలలో ఉద్యోగం కల్పించారు. శనివారం ఉదయం నల్లబెల్లి నుంచి ఆర్టీసీ బస్సులో వరంగల్‌కు చేరుకున్న సత్యం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

కల్యాణమస్తు
..మీ జీవిత భాగస్వామి ఎంపికలో ఆత్మీయ బంధువు

శ్రీ సౌభాగ్య మ్యారేజ్ బ్యూరో

రెడ్డి వధూవరులకు ప్రత్యేకంగా చూడబడును మరియు అన్ని కులముల పెండ్లి సంబంధములకు సంప్రదించండి:
16 Year's Experience
Dr. Smt. Konala Bhagyalakshmi Reddy, Astrologer,
Ex:Telangana Marriage Bureau Association.
H.O.: షాప్ నెం.48, HMDA కాంప్లెక్స్, తార్నాక, హైదరాబాద్
B.O.: Opposite Sai Baba Temple, Dilsukhnagar,
Whatsapp: 9866044439